# ప్రజా తీర్పును గౌరవిస్తాం

- నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిది
- నాలుగు సార్లు అవకాశం కల్పించారు
- ఎన్నికల తర్వాత రాజకీయాలు మాట్లాడను
- అవసరమైతే ప్రజల పక్షాన పోరాడుతాం
- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : న్యాయ నిర్ణేతలైన ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. ఉత్కంఠ రేపిన కరీంనగర్ ఫలితాల అనంతరం ఆదివారం రాత్రి స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా తనను నాలుగోసారి గెలిపించిన కరీంనగర్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. తాను చేసిన అభివృద్ధిని చెప్పి ఓట్లు అడిగానని, ఆ అభివృద్ధికే ప్రజలు పట్టం కట్టారని చెప్పారు. నియోజకవర్గంలో జరిగే అభివృద్ధిని కొనసాగించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. తన విజయం కోసం నియోజకవర్గంలోని హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, దళితులు, బలహీన, తదితర అన్ని వర్గాల ప్రజలు కృషి చేశారని, నియోజకవర్గాన్ని తాను అభివృద్ధి చేశానని విశ్వసించి తనకు ఓట్లు వేశారని తెలిపారు. కరీంనగర్‌ను రాష్ట్రంలో రెండో నగరంగా అభివృద్ధి చేయాలనే తన లక్ష్యాన్ని పూర్తి చేస్తానని



కరీంనగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

హామీ ఇచ్చారు. ఇన్నాళ్లూ అధికార పార్టీలో మంత్రిగా పనిచేసిన తాను ఇప్పుడు ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని అన్నారు. అభివృద్ధిని కొనసాగించేందుకు ప్రభుత్వాన్ని నిధులు ఇవ్వాలని కోరాతామని, ఒక వేళ నిధులు ఇవ్వకుంటే ప్రశ్నిస్తామని, లేదంటే ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. తమ నాయకుడు కేసీఆర్ తమకు తరుచూ చెబుతారని, ఓట్లు వేసిన ప్రజలను ఎప్పటికీ విస్మరించకూడదని, వారి రుణం తీర్చుకునేందుకు కృషి చేయాలని అంటారని, అదే స్ఫూర్తితో ఇప్పుడు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలు అందిస్తానని అన్నారు. తమ పార్టీ ఓడిపోయినా రాష్ట్రంలో వేరే పార్టీ అధికారంలోకి వచ్చినా ఎమ్మెల్యేగా తన నియోజకవర్గం ప్రశాంతంగా ఉండేలా చూస్తానని అన్నారు. ఈరోజు వరకు ఎన్నికల ప్రక్రియ ముగిసిందని, రేపటి నుంచి అభివృద్ధి ఒక్కటే తనకు కనిపిస్తుందని, రాజకీయాలు మాట్లాడబోనని అన్నారు. తనను రాజకీయాలు మాట్లాడేలా చూడవద్దని ఇతర పార్టీల నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేగా ఈ నియోజకవర్గానికి నాలుగుసార్లు ప్రాతినిథ్యం వహించే అదృష్టాన్ని కలిగించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ కార్యకర్తలు తన గెలుపు కోసం కసిగా పనిచేశారని, ప్రతి పార్టీ కార్యకర్తకు, నాయకులకు, ప్రజా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎంఐఎం పార్టీ కార్యకర్తలు, నాయకులు కూడా తన గెలుపునకు సంపూర్ణంగా సహకరించారని వారికి ధన్యవాలు చెప్పారు. రేపటి నుంచి అధికారంలోకి వచ్చే పార్టీ ఈ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, లేని పక్షంలో ప్రజల పక్షాన పోరాటం చేస్తానని అన్నారు. అభివృద్ధికి సహకరిస్తామని, ప్రజా వ్యతిరేక చర్యలు తీసుకుంటే పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట నగర మేయర్ వై సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌తోపాటు ఎంఐఎం పార్టీ నాయకులు ఉన్నారు.

# రెంటికీ చెడ్డ రేవడిలా 'ఈటల'

- రెండు చోట్లా పరాజయం

హుజూరాబాద్, డిసెంబర్ 3: బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అతి విశ్వాసమే ఆయన కొంపముంచిందని రాజకీ య విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉప ఎన్నికలు కలుపుకొని ఏడుసార్లు గెలిచిన ఆయన,ఎనిమిదోసారి బొక్కా బోర్లా పడ్డారు. రెంటికి చెడ్డ రేవడిలా ఇటు హుజూరాబాద్, అటు గజ్వేల్‌లో రెం డు చోట్లా ఓడిపోయారు. 2004 నుంచి వరుసగా ఆరుసార్లు బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన ఆయన, తిరుగులేని నేతగా ఎదిగారు. ఆ తర్వాత బీజేపీలో చేరి, 2019 ఉప ఎన్నికల్లో గెలిచారు. ఆ సమయంలో ఎక్కడికి వెళ్లినా హుజూరాబాద్ నాకు కన్న తల్లిలాంటిదని, ఇక్కడి ప్రజల రుణం తీ ర్చుకోలేనిదని చెప్పారు. మీ కాలుకు ముళ్లు విరిగితే నా పంటితో తీస్తానని, ప్రతి ఇంటికీ కన్నకొడుకు ల్లా ఉండి కాపాడుకుంటానని రాజేందర్ చెప్పుకొచ్చారు. అలా సానుభూతితో గెలిచిన ఆయన, తా జా ఎన్నికల్లో రెండు చోట్ల నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. హుజూరాబాద్ నుంచే కాకుండా గజ్వేల్ నుంచి కేసీఆర్‌పై పోటీ చేశారు. ఆయన పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడే అయింది. అక్కడ గజ్వేల్ ఓడిపోగా, ఇక్కడ హుజూరాబాద్‌లోనూ పరాజయం పాలుకావాల్సి వచ్చింది.

# కాంగ్రెస్ సంబురాల్లో అపశ్రుతి

మంథని రూరల్, నవంబర్ 3: పెద్దపల్లి జిల్లా మంథని రూరల్ మండలం గుంజపడుగులో కాంగ్రెస్ విజయోత్సవ సంబురాల్లో ఆదివారం ఆపశృతి చోటు చేసుకున్నది. మంథని ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విజయం సాధించడంతో కాంగ్రెస్ శ్రేణులు గ్రామంలో చౌరస్తా వద్ద నేతాజీ విగ్రహం చుట్టూ ట్రాక్టర్లతో చక్కర్లు కొడుతున్న సమయంలో ఆదుపు తప్పి గుర్రం సతీశ్(35) అనే యువకుడు నడుపుతున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సతీశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

# ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

కలెక్టరేట్, డిసెంబర్ 3: నగరంలో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ దివ్యాంగులు, వయోవృద్ధుల వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించడంలో, వారి సంక్షేమం కోసం దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని స్పష్టం చేశారు. ఆత్మవిశ్వాసంతో దివ్యాంగులు ముందుకు సాగాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమై ఉద్యోగాలు సాధించాలని వసతిగృహంలో ఉండే దివ్యాంగ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆర్ శ్రీనివాస్, వార్డెన్ రాధిక, తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి మిఠాయి తినిపిస్తున్న డీడబ్ల్యూవో సరస్వతి

# వైభవంగా కార్తీక దీపోత్సవం

- తులసీ కల్యాణం
- భక్తులతో కిటకిటలాడిన దుర్గాభవానీ ఆలయం



తులసీ కల్యాణం జరిపిస్తున్న వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ

కరీంనగర్ రూరల్, నవంబర్ 3: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకొని ఆదివారం ఆలయ ధర్మాధికారి, వేద పండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారికి కార్తీక మాస ప్రయోక్త చతుషష్టి పూజలు, దీపసంకల్పం, దీపారాధన, మహామంగళ హారతి, దీప విశిష్టత ప్రవచనాలు జరిగాయి. తులసీ కల్యాణం జరిపించారు. సుహాసినీ సేవాదళ్, దుర్గాభవానీ సేవా సభ్యులు, ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులతో తీర్చిదిద్దారు. ప్రమిదలను వివిధ ఆకృతుల్లో అమర్చారు. దీప సంకల్పన అనంతరం ఏకకాలంలో దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శివాలయం సుందరేశ్వర స్వామి వారికి భక్తులు గోత్ర నామాలతో అన్నపూజ, మహాలింగార్చన, ప్రత్యేక పూజలు జరిగాయి. శివాలయం ముందు అమ్మవారి ఆలయ ధ్వజ స్తంభం వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలించి. దీపారాధన చేసి పూజారులకు దీపాదానం చేశారు. ఈ పూజల్లో ఆలయ అర్చకుడు పవనకృష్ణ శర్మ, ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన సంబురాలు



కరీంనగర్‌రూరల్: చామనపల్లిలో నృత్యాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

తెలంగాణచౌక్, డిసెంబర్ 3: కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ విజయం సాధించిన సందర్భంగా తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం మొండయ్య ఆధ్వర్యంలో నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం సంబురాలు నిర్వహించారు. సంఘ సభ్యులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నీలం మొండయ్య మాట్లాడుతూ, గంగుల కమలాకర్ నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందండం సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల జయరాం, పట్టణ గౌరవాధ్యక్షుడు లక్ష్మణ్, పట్టణాధ్యక్షుడు జంపాల సంపత్, ప్రధాన కార్యదర్శి కంది వెంకటేశ్, నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-314353-All
★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194